ఆర్టిజన్ల సమ్మె పాక్షికం

లక్డీకాపూల్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించి రెగ్యులర్ ఉద్యోగులతో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం చేపట్టిన సమ్మె పాక్షికంగా కొనసాగింది. గ్రేటర్ జిల్లాల్లో 7,500 మంది ఆర్టిజన్లు కార్మికులు ఉండగా సగం మంది విధులకు గైర్హాజరయ్యారు. సమ్మె నేపథ్యంలో డిస్కం యాజమాన్యం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది.

పెద్ద మనసు చాటుకున్న లావణ్య త్రిపాఠి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహాన్ని మంగళవారం సినీనటి లావణ్య త్రిపాఠి సందర్శించారు. విద్యార్థులకు అవసరమయ్యే లక్ష రూపాయల విలువైన మందులు, మైక్ సెట్, కిరాణా సామగ్రి అందజేశారు. విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. కార్యక్రమంలో అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తు గడువు పెంపు

చాదర్‌ఘాట్: తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ అందజేసే ఉచిత ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు తమకు అవసరమైన ఉపకరణాల కోసం మే 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సంక్షేమశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

వడ్డెర బంధును ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న వడ్డెర వృత్తిదారుల సంఘం సభ్యులు

తుర్కయంజాల్: వడ్డెర వృత్తిదారులు నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంచం వెంకటకృష్ణ, పల్లపు విఘ్నేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తుర్కయంజాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 4వేల సొసైటీలు ఉన్నప్పటికీ ప్రభుత్వం పైసా ఖర్చు చేయడం లేదన్నారు. వడ్డెర బంధు పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎలాంటి ఈఎండీ లేకుండా కాంట్రాక్టు పనుల్లో 30 శాతం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా డేరంగుల లక్ష్మీపతి, కో కన్వీనర్లుగా గోగుల రాజు, తన్నీరు చెన్నమ్మ, సభ్యులుగా గుర్రం సత్యనారాయణ, గండికోట సత్యం, పల్లపు కృష్ణం రాజు, బింత రాంమూర్తి, డేరంగుల బాలకృష్ణ, సుదర్శన్, భిక్షమయ్య ఎన్నికయ్యారు.

గొర్రెల పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప



గొర్రె కాపరులతో మాట్లాడుతున్న డాక్టర్ అంజిలప్ప

నందిగామ: ప్రభుత్వం త్వరలో పంపిణీ చేయనున్న గొర్రెల పంపిణీ పథకాన్ని కాపారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప అన్నారు. మండల పరిధిలోని మొత్కులగూడలో మంగళవారం స్థానిక మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గొర్రె కాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అంజిలప్ప మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాబోతోందని తెలిపారు. మొదటి విడతలో గొర్రెలు అందని వారితో పాటు రెండో జాబితాలో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వాటాగా రూ.43,750 ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. జాబితాలో పేర్లు నమోదు చేసుకున్న ఎవరైనా గొర్రె కాపారులు చనిపోతే వారి నామినీలు సైతం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలని, వారికి కూడా యూనిట్‌లు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గొర్రె కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు బీరయ్య, గొర్రె కాపరులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



సభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మీర్‌పేట: మతోన్మాద బీజేపీ నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. లెనిన్‌నగర్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు దేశ వ్యాప్తంగా ప్రతి రాష్ట్రం జిల్లా, గ్రామాల్లో తిరుగుతూ బీజేపీకి హటావో దేశ్‌కో బచావో నినాదంతో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. మోదీ పాలనలో పెరిగిన నిత్యావసర, ఇంధన ధరలతో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రజల సొమ్మును ధారాదత్తం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, బి.బాలరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానగంటి పర్వతాలు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్, బాలాపూర్ మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో వీఓఏలు, సీసీలకు యాప్‌పై ఇటీవల శిక్షణ ఇచ్చిన అధికారులు

పొదుపు లెక్క.. ఇక పక్కా!



లోకోస్ యాప్ యూజర్ మాన్యువల్

వివరాల్లో పారదర్శకత కోసం లోకోస్ యాప్

- మహిళా సంఘాల సభ్యుల లెక్కలన్నీ ఇందులోనే..
- అందుబాటులోకి తెస్తున్న పేదరిక నిర్మూలన సంస్థ
- ఇప్పటికే వీవోఏ, ఏపీఎం, సీసీలకు శిక్షణ
- మే నుంచి ప్రారంభం కానున్న యాప్ సేవలు

షాద్‌నగర్: పొదుపు సంఘాల లెక్కలు ఇక పక్కాగా ఉండనున్నాయి. ఇందుకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. మహిళా సంఘాల ద్వారా సభ్యులు పొందే రుణాలు, వారి చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పారదర్శకత చోటు చేసుకోనుంది. ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, నిర్వహిస్తున్న వ్యాపారం, లాభాలు తదితర సమాచార వివరాలు పక్కగా ఉండేలా కొత్తగా లోకోస్ అనే యాప్ మే నుంచి అందుబాటులోకి రానుంది. దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలు ఒకే యాప్‌లో పొందుపర్చనున్నారు. పేదరిక నిర్మూలన సంస్థ ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

యాప్‌పై శిక్షణ

ప్రస్తుతం లోకోస్ యాప్‌లో నమోదు ప్రక్రియ అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఓ, సీబీఓ, ఆడిటర్లు, డీపీఎంలతో పాటు ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వారు క్షేత్ర స్థాయిలో పొదుపు సంఘాలకు మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. మహిళా సంఘాల సభ్యుల నుంచి ఏఏ వివరాలు సేకరించాలి, యాప్‌లో వివరాలను ఎలా అప్‌లోడ్ చేయాలన్న విషయాలపై శిక్షణ ఇస్తున్నారు.

వేర్వేరు యాప్‌లకు ఇక స్వస్తి

ఇప్పటి వరకు పొదుపు సంఘాల వివరాలు వేర్వేరు యాప్‌లలో నమోదు చేసే వారు. సంఘాల పని తీరు, ఆర్థిక లావా దేవీలు, ఇతర వివరాల నమో దుకు ఒక్కో యాప్‌ను వినియోగించే వారు. దీంతో వారి సమాచారం సేకరించడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు పేదరిక నిర్మూలన సంస్థ లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తేనుంది.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత

ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండేలా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లిస్తున్న వాయిదాలకు సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులువుగా ఉంటుందని భావించిన డీఆర్‌డీఏ సంస్థ లోకోస్ యాప్‌ను ప్రతిపాదించింది. పొదుపు సంఘాల పర్యవేక్షణను విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏలు) చూసుకునే వారు. ఒక్కో సంఘానికి ఒక్కొక్కరిని నియమించారు. వీఓఏలు కూడా పొదుపు సంఘాల సభ్యులే కావడంతో పారదర్శకత లోపిస్తుందని భావించి పక్కా వివరాలు తెలియజేసేలా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు.

తగ్గనున్న పనిభారం

మహిళా సంఘాలకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండేందుకు గాను ఈ కొత్త యాప్‌నకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. భవిష్యత్తులో ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకొని మహిళా సంఘాల సభ్యులకు రుణాలను మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. ఎక్కడైనా రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ వేర్వేరు చోట్ల రుణాలు పొందడానికి ఇకపై అవకాశాలు ఉండవు. సంఘాల సభ్యులకు సంబంధించిన లెక్కలు ఒకే చోట చూసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పని భారం కూడా తగ్గనుంది.

సమాచారం అంతా ఒకేచోట



లోకోస్ యాప్‌తో పొదుపు సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒక చోట లభిస్తుంది. మే 1 నుంచి యాప్ అందుబాటులోకి రానుంది. మహిళా సంఘాలు, సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పటి వరకు వేర్వేరు యాప్‌లలో నమోదు చేసే వారు. కొత్త యాప్‌తో ఒకేచోట సమాచారం అంతా లభిస్తుంది.

– ప్రభాకర్, పీడీ, డీఆర్‌డీఏ

రాష్ట్రంపై కేంద్రం వివక్ష

- అభివృద్ధి ఘనత మాదే
- బీఆర్‌ఎస్‌పార్టీ మినీ ప్లీనరీలో ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రానికి రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్‌పార్టీ మినీ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం చేవెళ్ల ప్రాంత ప్రజలకు గుదిబండగా ఉన్న జీఓ 111ను తొలగించిందని గుర్తు చేశారు. బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించేలా కృషి చేశామని చెప్పారు. 72శాతం భూ సేకరణ కూడా పూర్తయిందని ఏడాదిలోగా ఈ రోడ్డును అందుబాటులోకి తెస్తామన్నారు. రూ.5,180 కోట్లతోపాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ మొదలైందన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై బీజేపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని ఎంపీ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి పథకం పేదలకు అందుతోందని, ఇది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమైందని తెలుసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ బలం.. బలగం నాయకులు, కార్యకర్తలేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, నక్షత్రం, కాలె భవని, జెడ్పీటీసీలు ఎం.మాలతి, శ్రీకాంత్, జయమ్మ, గోవిందమ్మ, మార్కెట్‌కమిటీ చైర్మన్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, రైతు సమితి నాయకులు, మాజీ సర్పంచులు, గ్రామ కమిటీల నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న స్పౌజ్ ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ దంపతుల బదిలీలను వెంటనే చేపట్టాలని స్పౌజ్ ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌జీటీ, పీఈటీ స్పౌజ్ ఉపాధ్యాయులు పిల్లా పాపలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. 16 నెలల క్రితం నిలిచిపోయిన బదిలీలు నేటికీ పూర్తి కాలేదని మండిపడ్డారు. భర్త ఒక చోట భార్య ఒక చోట పని చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు వివేక్, ప్రధాన కార్యదర్శి ఖాదర్, కో కన్వీనర్ త్రివేణి, సిద్ధయ్య, ఎన్‌వీసీఎస్ రెడ్డి, ఎస్ఆర్‌కే రావు, సునీత, సూర్యమ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే న్యాయ సలహా కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి శ్రీదేవి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఆమనగల్లు: వ్యవసాయ న్యాయ సేవ సలహా కేంద్రాల ద్వారా రైతులు న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు న్యాయపరమైన సమస్యలుంటే న్యాయ సలహా కేంద్రం దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి గీతారెడ్డి, సీఐ ఉపేందర్, తహసీల్దార్ జ్యోతి, వ్యవసాయాధికారి అరుణకుమారి, మండల కార్యదర్శి నారాయణ, బాల్‌రెడ్డి, శ్రీలత, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలి

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశంలో మంత్రి సబితా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. పహాడీషరీఫ్ ఆర్‌సీఐ రోడ్డులో మంగళవారం ఏర్పాటు చేసిన మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ కార్యకర్తల ప్లీనరీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తొమ్మిదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూస్తున్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమకు ఇలాంటి సీఎం, ఇలాంటి పార్టీ కావాలంటున్నారని పేర్కొన్నారు. రైతుల క్షేమం కోసం ఢిల్లీలో చేసిన ధర్నాతో దేశం మొత్తం కేసీఆర్‌వైపు చూస్తోందన్నారు. కేటీఆర్ కమిట్‌మెంట్‌తో హైదరాబాద్ మహానగరంలో ప్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, ఎస్ఎన్‌డీపీ పనులు కొనసాగుతున్నాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ.. క్లిష్టమైన తెలంగాణను ఇంత అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌కు మోదీకి ఎంతో పోలిక ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన 52 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏడుగురు సీఎంలను చూశానని వారిలో కేసీఆర్ ఎంతో గొప్పగా పరిపాలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి, జల్‌పల్లి వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, తుక్కుగూడ వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, కందుకూర్ జెడ్పీటీసీ జంగారెడ్డి, సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రాచకొండ కమిషనరేట్ సైబర్‌క్రైం డీసీపీ అనురాధ

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం డీసీపీ డాక్టర్ బి.అనురాధ విద్యార్థులకు సూచించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లి సమీపంలో ఉన్న సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సామాజిక మాధ్యమాలకు యువత, విద్యార్థులు బానిసలైపోతున్నారని అన్నారు. అదేస్థాయిలో మోసాలు కూడా పెరిగిపోతున్నాయని గుర్తు చేశారు. ఆన్‌లైన్ రుణాల పేరుతో అనేక రకాలుగా విద్యార్థులు మోసపోతున్నారని, చివరికి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తోందన్నారు. రుణయాప్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గోప్యమైన సమాచారం అందరికీ షేర్ చేయొద్దని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930 అందుబాటులో ఉంటుందని చెప్పారు. అవసరమైతే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశం, సీఐలు రామకృష్ణ, కిరణ్‌కుమార్, ఎస్ఐలు మారయ్య, నరేష్, సీవీఆర్ కళాశాల యాజమాన్యం నారాయణరెడ్డి, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత శక్తి ప్రోగ్రాం సభా ఏర్పాట్ల పరిశీలన

హుడాకాంప్లెక్స్: తెలంగాణలో మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలు స్వరాజ్యాన్ని సాధించేందుకు తలపెట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను ఈ నెల 30న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం డీఎస్పీ (దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహరాజ్ స్టేడియాన్ని పరిశీలించారు. సభ ఏర్పాట్లపై రాష్ట్ర నాయకులతో చర్చించారు. ముగింపు సభకు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రాష్ట్ర నాయకుడు అంజయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, నాయకులు లింగస్వామి, సైదులు పాల్గొన్నారు.



ఫైర్ 'సేఫ్టీ'పై పట్టింపేదీ?

- మంటల్లో ప్రాణాలు పోతున్నా స్పందించరా?
- రక్షణ ఏర్పాట్లకు అవకాశం కల్పించినా.. ముందుకురాని చిరు వ్యాపారులు
- గ్రేటర్‌లో సుమారు 6 లక్షల దుకాణాలు
- 700 మంది కూడా ముందుకు రాని వైనం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నాయి. దీంతో నివారణ చర్యలకు సిద్ధమైన జీహెచ్ఎంసీ ఈవీడీఎంలోని ఫైర్‌సేఫ్టీ విభాగం నగరంలోని అన్ని దుకాణాల వారు అగ్నిప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించింది. దాదాపు వంద చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన చిన్న దుకాణాలైనా కనీసం ఫైర్ ఎక్స్టింగిషర్లయినా ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. తద్వారా దుకాణదారులతో పాటు కొనుగోలుదారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడకుండా నివారించవచ్చని పేర్కొంది. వస్తు సామగ్రి వంటివి అగ్నికి ఆహుతి కాకుండా, ఆస్తినష్టం జరగకుండా చూసుకోవచ్చని వివరించింది. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఈ ఏర్పాట్లు అవసరమని సూచించింది. అంతేకాదు.. వాటిని అమర్చే ఏజెన్సీల జాబితాను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి తమకు నచ్చిన ఏజెన్సీ ద్వారా వాటిని అమర్చుకోవాలని సూచించింది. వాటిని ఏర్పాటు ఏర్పాటు చేసుకున్నాక ఏజెన్సీలు ఆన్‌లైన్‌లోనే ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలియజేస్తాయని, అనంతరం అధికారులు పరిశీలించి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ జారీ చేస్తారని, దానిని ఆన్‌లైన్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకొని దుకాణాల్లో ప్రదర్శించాలని పేర్కొంది. చిన్న వ్యాపారాలైనా ప్రమాదాలతో పెద్ద నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ఇవి అవసరమని భావించింది. ఈ సదుపాయం అందుబాటులోకి తెచ్చి నెల రోజులవుతున్నా వ్యాపారుల స్పందన నామమాత్రంగానే ఉంది.

ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు వందల్లో..

జీహెచ్ఎంసీ పరిధిలో ట్రేడ్ లైసెన్సులున్న దుకాణాలే ఆరు లక్షలకుపైగా ఉన్నాయి. లైసెన్సులు లేకుండా నడుస్తున్న వాటికి లెక్కేలేదు. చిన్న దుకాణాలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లకు కనీసం వెయ్యిమంది కూడా ముందుకు రాలేదు.

రెస్టారెంట్స్, దాబాలపై ఎస్ఓటీ దాడులు

దాబా యజమానిపై కేసు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని రెస్టారెంట్, దాబాలపై మంగళవారం ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాల వద్ద దాబాల్లో, రెస్టారెంట్‌లో మద్యం విక్రయాలు, సిట్టింగులు నిర్వహించకూడదని సోమవారం శంకర్‌పల్లి పోలీసులు హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మోకిల శివారుల్లోని కృత్తిక దాబా యాజమాని సిట్టింగ్ నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేపడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి యజమాని ముక్తార్‌ను అదుపులోకి తీసుకుని శంకర్‌పల్లి పోలీసులకు అప్పగించారు. దాబా యజమానిపై శంకర్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ కళాశాల ప్రాంతంలో దాబాల్లో మద్యం నిల్వలున్నాయని.. సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని.. హుక్కా సెంటర్‌లు కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలుగ్రామాల ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: చెరువులో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం.. చౌదరిగూడ శివారులో చెరువు ఒడ్డున ఓ బెడ్ షీట్‌లో మృతదేహం ఉన్నట్లు మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ భాస్కర్, ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. నీలి రంగు బెడ్‌షీట్‌లో వ్యక్తి మృతదేహం చుట్టి నీళ్లల్లో పడవేశారు. మృతదేహం కుళ్లిపోవడంతో గుర్తించలేకపోయారు. మృతుడి ఒంటిపై నల్లరంగు ప్యాంటు, బూడిద రంగు షర్టు ఉన్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

భార్య మృతికి కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు

రూ.4వేల జరిమానా

ఇబ్రహీంపట్నం: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రాకేశ్‌కు 2007లో రష్మితో పరిచయం ఏర్పడింది. 2010లో వారు వివాహం చేసుకుని హైదరాబాద్‌లోని హ్యాపీ హోమ్స్‌లో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన రాకేశ్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. 2013 మార్చి 5న తన స్నేహితులతో కలిసి విందు చేసుకుని తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన భార్యతో గొడవపడి అసభ్యపదజాలంతో దూషిస్తూ చేయిచేసుకున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రష్మి బలవన్మరణానికి పాల్పడింది. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఇందిర నిందితుడికి ఐదేళ్లజైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. కాగా నిందితులను దోషులుగా నిర్ధారించడానికి కృషి చేసిన ఐఓ, సీడీఓ, ఏడీఎల్ పీపీలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ సత్యనారాయణ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

సంతోష్‌నగర్: బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి నాంపల్లి పోక్సో కోర్టు జడ్జి టి.అనిత 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సంతోష్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్ పరిధిలోని కలందర్‌నగర్ ఖుర్షీద్ జా మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ సజ్జాద్ 2022లో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సంతోష్‌నగర్ పోలీసులు..నిందితుడు మహ్మద్ సజ్జాద్‌ను నాంపల్లి పోక్సో కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితునికి 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రవి ప్రకాష్ హర్మ్యాళ్‌కు 'తెలంగాణ రత్న'



అవార్డు అందుకుంటున్న రవిప్రకాష్ హర్మ్యాళ్

షాద్‌నగర్: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక, సామాజిక సేవా విభాగంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువ కవి రవి ప్రకాష్ హర్మ్యాళ్ తెలంగాణ రత్న అవార్డును సమాఖ్య వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్, వకులాభరణం కృష్ణ మోహన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగంగౌడ్



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగంగౌడ్

మొయినాబాద్‌రూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేవెళ్ల బహిరంగ సభలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్‌లను రద్దు చేస్తామని వ్యాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రభులింగంగౌడ్ అన్నారు. భారతదేశం లౌకిక రాజ్యమని ఈ విధంగా మాట్లాడడం అమిత్‌షాకు తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి, తోల్‌కట్ట, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో సీపీఐ జాతీయ ప్రచార జాతను మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగంగౌడ్, సీపీఐ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కె.రామస్వామిలు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, తెలంగాణ విభజనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. బయ్యారం గనులు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాలను గద్దెదింపడమే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఏకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, బీకేఎం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లేష్, మహిళా సంఘం నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

రెడీ ఫర్ సేల్!

- అమ్మకానికి హెచ్‌ఎండీఏ ప్లాట్లు
- బాచుపల్లిలో 133, మేడిపల్లిలో 85 ప్లాట్లు
- మే నెలలో ఆన్‌లైన్ బిడ్డింగ్
- రూ.300 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం

hmda Growing Global

సాక్షి, సిటీబ్యూరో: బాచుపల్లి, మేడిపల్లి ప్రాంతాల్లో గతంలో విక్రయించగా మిగిలిన ప్లాట్లను హెచ్‌ఎండీఏ మరోసారి అమ్మకానికి పెట్టింది. బాచుపల్లిలో ఔటర్‌కు దగ్గర్లో హెచ్‌ఎండీఏకు 133 ప్లాట్‌లు ఉన్నాయి. వీటిలో చాలా వరకు 265 గజాల నుంచి 576 చదరపు గజాల వరకు విస్తీర్ణం కలిగిన ప్లాట్లే ఉన్నాయి. అలాగే మేడిపల్లిలో 230 గజాల నుంచి 643 గజాల విస్తీర్ణం వరకు ఉన్న 85 ప్లాట్లను ఈ–ఆక్షన్ ద్వారా విక్రయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బాచుపల్లిలో గజానికి రూ.25వేలు, మేడిపల్లిలో గజానికి రూ.32 వేల చొప్పున కనీస ధరను నిర్ణయించారు. బాచుపల్లిలోని ప్లాట్లకు మే 22, 23 తేదీల్లో మేడిపల్లిలోని ప్లాట్లకు మే 24,25 తేదీల్లో ఈ–ఆక్షన్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అవకాశం ఉంటుంది. సామాన్య, మధ్యతరగతి వర్గాల నుంచి రియల్‌ఎస్టేట్ వర్గాల వరకు, బిల్డర్లు, తదితర వ్యాపార వర్గాలకు చెందిన వారు కూడా కొనుగోలు చేసేందుకు ఈ ప్లాట్లు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ–ఆక్షన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు బాచుపల్లి ప్లాట్లకు మే 19, 20 తేదీల్లో, మేడిపల్లి ప్లాట్లకు మే 22, 23 తేదీల్లో రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరోవైపు ఈ ప్లాట్లపైన అవగాహన కల్పించేందుకు మే 8, 9 తేదీల్లో ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

రూ.300 కోట్ల వరకు ఆదాయం...

ఈ రెండు చోట్ల ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.300 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు అంచనా. ఇటీవల బాచుపల్లిలో నిర్వహించిన వేలంలో 73 ప్లాట్లను విక్రయించారు. ఈ ప్లాట్లపైన సుమారు రూ.49 కోట్ల వరకు లభించవచ్చునని అంచనా వేయగా అనూహ్యంగా రూ.116 కోట్లు లభించింది. చదరపు గజం రూ.68 వేల వరకు ధర పలికింది. ఈ మేరకు బాచుపల్లి, మేడిపల్లిల్లో అన్ని ప్లాట్లను విక్రయిస్తే రూ.300 కోట్ల వరకు ఆదాయం లభించవచ్చునని అంచనా వేశారు. మరోవైపు ఈ స్థలాలు బహుళ వినియోగ జోన్‌లో ఉండడం వల్ల కొనుగోలుదారులు వివిధ రకాల అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలను చేపట్టవచ్చు.

జంట జలాశయాల్లో కాలుష్యం తగ్గించేందుకు ..

నాలుగు ఎస్టీపీలు

సాక్షి, సిటీబ్యూరో: జంట నగరాల దాహార్తిని తీర్చే జంట జలాశయాలు..ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు కాలుష్య కాసారాలుగా మారకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జలాశయాలకు ఎగువ నుంచి వచ్చే వరదనీరు కలుషితం కాకుండా నివారించేందుకు నాలుగుచోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.82.23కోట్లను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా గతేడాది జీవో 111ను ఎత్తివేయడంతో జంట జలాశయాల పరిధిలో ఇతరత్రా కార్యకలాపాలు పెరిగాయి. దీంతో జంట జలాశయాల్లోకి కాలుష్యకారకాలు భారీగా చేరుతున్నాయి. ఇక రోజువారీ ఈ నాలుగు ఎస్టీపీల ద్వారా 20 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయాలని జలమండలి లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండు జలాశయాలసమీప గ్రామాల నుంచి నిర్విరామంగా కొనసాగుతున్న మురుగునీటి కాలుష్యాన్ని అరికడతారు.

ఎంసీఏ విద్యార్థి ఆత్మహత్య



రినేష్ (ఫైల్)

చైతన్యపురి: ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న ఎంసీఏ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ పట్టణానికి చెందిన జాలా లింగేశం, లక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు రినేష్(22) దిల్‌సుఖ్‌నగర్ మధురాపురి కాలనీలోని రాఘవేంద్ర బాలుర హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తోటి విద్యార్థి సాయి హాస్టల్ రూంకు వచ్చి చూడగా లోపలివైపు తలుపుకు గడియ పెట్టి ఉంది. సాయి తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా రినేష్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే సాయి హాస్టల్ నిర్వాహకుడు రమేష్‌కి సమాచారం ఇవ్వగా తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి రినేష్‌ను కిందకు దించారు. అనంతరం 108కు సమాచారం ఇవ్వగా...వారు వచ్చి పరీక్షించి రినేష్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం తండ్రి లింగేశంకు సమాచారం ఇచ్చారు. హాస్టల్ నిర్వాహకుడు రమేష్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నగరానికి చేరుకున్న రినేష్ కుటుంబ సభ్యులు, బంధువులు హాస్టల్‌కు చేరుకుని..మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ హాస్టల్ ముందు ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న వారికి పలు విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. తాము రాకముందే మృతదేహాన్ని ఎందుకు తరలించారని ప్రశ్నించారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. కాగా గత 10 రోజులుగా రినేష్ డల్‌గా ఉంటున్నాడని, తనకు చదువు ఇష్టం లేదని తెలిపినట్లు తోటి విద్యార్థులు పోలీసులకు తెలిపారు. కాగా రినేష్ ఆత్మహత్యపై అన్ని కోణాల్లో విచారణ చేపడతామని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు రినేష్ తండ్రి లింగేశంకు హామీఇచ్చారు.

ఐ మిస్ యూ....

రినేష్ ఆత్మహత్యకు ముందు 'ఐ మిస్ యూ నాన్న, మమ్మీ, అన్న, స్నేహితులు' అని సూసైడ్ నోట్ రాసినట్లు తెలుస్తోంది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

వామ్మో.. వెయ్యి!

- పుష్పక్ బస్ పాస్‌పై భారీగా బాదుడు
- రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు
- త్వరలో అమల్లోకి వచ్చే అవకాశం
- ఎయిర్‌పోర్టు రూట్‌లో పెరిగిన ఆదరణ



సాక్షి, సిటీబ్యూరో: పుష్పక్ బస్సు చార్జీలు పెంచేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేపట్టింది. ఇంచుమించు ఏడాది క్రితమే పుష్పక్ పాస్ చార్జీలను రూ.3 వేలకు పెంచిన ఆర్టీసీ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా రూ.4వేలకు పెంచేందుకు తాజాగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కొద్ది రోజుల క్రితమే ఎయిర్‌పోర్టు రూట్లలో సర్వే నిర్వహించి బస్‌పాస్ చార్జీల పెంపునకు అనుగుణంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు నివేదికను అందజేసినట్లు తెలిసింది. చార్జీల పెంపు ఫైల్‌పై ఎండీ సంతకం చేసిన వెంటనే ధరలు అమల్లోకి రానున్నట్లు సమాచారం.

- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి రోజు వందలాది మంది ఉద్యోగులు ఎయిర్‌పోర్టు వరకు పుష్పక్ బస్సుల్లో ప్రయాణం చేస్తారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులతో పాటు ఉద్యోగుల్లోనూ పుష్పక్ బస్సులకు ఆదరణ ఉంది. ఈ క్రమంలో గతేడాది పుష్పక్ చార్జీలతో పాటు, బస్‌పాస్ చార్జీలను కూడా అధికారులు పెంచారు. ఏడాది గడవకుండానే మరోసారి ప్రయాణికుల నడ్డి విరిచేలా ఏకంగా రూ.వెయ్యి వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సాధారణ హౌస్‌కీపింగ్ సిబ్బంది మొదలుకొని ఎయిర్‌పోర్టులోని వివిధ విభాగాల్లో పని చేసే ఉద్యోగులు పుష్పక్ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. పాస్ ధరల పెంపుతో చిరుద్యోగులపై పెనుభారంగా మారనుంది. ఆర్టీసీ ఎండీ ఆమోదించిన వెంటనే పెంచిన పాస్ ధరలు అమల్లోకి వస్తాయని ఒక అధికారి తెలిపారు.

రెండేళ్లుగా ఆదరణ..

- ఏసీ పుష్పక్ బస్సులకు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. ఒకప్పుడు పీకల్లోతు నష్టాల్లో నడిచిన ఈ బస్సులు గత రెండేళ్లుగా లాభాల బాట పట్టాయి. నష్టాలను అధిగమించడంతో పాటు ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయి. నగరంలోని వివిధ మార్గాల నుంచి ఎయిర్‌పోర్టు వరకు అద్దె ప్రాతిపదికపై ఆర్టీసీ 40 ఏసీ బస్సులను నడుపుతోంది. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి తార్నాక, ఉప్పల్, ఎల్‌బీనగర్, బాలాపూర్ రూట్‌లలో కొన్ని బస్సులు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి బేగంపేట్ మీదుగా పీవీ ఎక్స్‌ప్రెస్‌వే, ఆరాంఘర్ రూట్‌లో కొన్ని బస్సు లు, జేఎన్‌టీయూ నుంచి గచ్చిబౌలి మీదుగా ఔటర్ రింగురోడ్డు మార్గంలో మరికొన్ని పుష్పక్ బస్సులు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. మొత్తం 40 బస్సులు ప్రతి రోజు 350 ట్రిప్పులు తిరుగుతున్నాయి.
- ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే విమాన వేళలకు అనుగుణంగా 24 గంటల పాటు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రతి రోజు నాలుగు వేల మందికి పైగా ప్రయాణం చేస్తారు. సుమారు 2500 మందికి పైగా ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి చేరుకొనేందుకు ఆర్టీసీ బస్సులను ఎంపిక చేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే సమయంలో మాత్రం ప్రయాణికుల సంఖ్య 1500 వరకు ఉంటుంది. దీంతో ఈ బస్సులు ప్రతి రోజు 70 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన ఆదాయం..

పుష్పక్ బస్సుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరిగింది. గత సంవత్సరం రూ.6 కోట్లు లభించగా ఈ ఏడాది అనూహ్యంగా రూ.12 కోట్లు లభించింది. కిలోమీటర్‌కు రూ.70 వరకు లభిస్తుండగా అందులో రూ.36 అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. బస్సులకు కరెంట్ చార్జింగ్, నిర్వహణ, సిబ్బంది ఖర్చులు అన్నీ కలిపి ఒక కిలోమీటర్‌పై రూ.45 వరకు ఖర్చవుతున్నట్లు అంచనా. ఇలా బస్సుల అద్దె, నిర్వహణ ఖర్చులు మినహాయిస్తే ఆర్టీసీకి ఒక కిలోమీటర్‌పై రూ.25 వరకు లభిస్తోంది. పుష్పక్ బస్సులపై మరింత ఆదాయాన్ని పెంచుకొనేందుకు తాజాగా బస్‌పాస్‌లపై దృష్టి సారించినట్లు సమాచారం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పాస్‌ల ధరలను పెంచాలని ప్రతిపాదించినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఆర్టిజన్‌ల ముందస్తు అరెస్టు

రాజేంద్రనగర్: స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేసి ఏపీఎస్ఈబీ విధానాన్ని వర్తింపజేయాలని ఆర్టిజన్‌లకు ప్రత్యేక పీఆర్‌సీని ప్రకటించాలని మంగళవారం నుంచి విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్‌లు సమ్మెకు దిగారు. ఉదయం రాజేంద్రనగర్, శివరాంపల్లి, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ముందు ఆందోళనకు దిగారు. మజ్లిస్ పార్టీ అనుకూల యూనియన్‌తో పాటు తెలంగాణ యూత్ ఎంప్లాయిస్ యూనియన్‌లు వీరికి మద్దతు పలికాయి. సమ్మె నేపథ్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులను ముందుజాగ్రత్తగా మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వీరిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్మికులు రాజు, సాజిత్, అనిల్ కుమార్, అహ్మద్, సీతారామ్ పాల్గొన్నారు.